మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలి

బాన్సువాడలోని క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ వరప్రసాద్

బాన్సువాడ, డిసెంబర్ 2 : మండల సమాఖ్య, డ్వాక్రా సభ్యులు చిరువ్యాపారాలతో ఆర్థికంగా ఎదగాలని, ఆర్థిక స్వావలంభన సాధించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బాన్సువాడలోని ఇందిరా మహిళా శక్తి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో స్థానిక తహసీల్దార్ వరప్రసాద్‌తో కలిసి సోమవారం మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. బాన్సువాడ ప్రాంతంలో గానుగ నూనె పట్టే మిషన్ల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులతో చర్చిస్తామని చెప్పారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

మాచారెడ్డి, డిసెంబర్ 2 : అర్హులైన రైతులందరికీ వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేయాలని పాల్వంచ మండలంలోని భవానీపేట గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సోమవారం గ్రామంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని, ప్రతి పంటకూ గిట్టుబాటు ధర కల్పించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

కామారెడ్డిలో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు

కామారెడ్డి, డిసెంబర్ 2 : మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నాగేశ్వర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మై ఆటో ఈస్ సేఫ్ అనే అంశంపై ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర ధ్రువీకరణ పత్రాలను వెంట పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సైలు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

■ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, డిసెంబర్ 2 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం బాల్య వివాహాల రహిత భారత్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, జడ్పీ సీఈవో చందర్ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల రహిత భారత్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ధరణి కోసం ఫిర్యాదులు

రాజంపేట్ డిసెంబర్ 2 : రాజంపేటలోని తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా ధరణికి సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

పీఎంపీపై ఫిర్యాదు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 2 : ఎల్లారెడ్డిలో పీఎంపీ రవీందర్‌పై పట్టణానికి చెందిన స్వర్ణలత సోమవారం కలెక్టర్ కార్యాలయం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. రవీందర్ వైద్యం చేయడంతో అనారోగ్యం పాలయ్యానని, అతడిపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపింది.

మద్యం మత్తులో అంబులెన్స్ డ్రైవర్ హంగామా

మద్యం మత్తులో పట్టుబడిన అంబులెన్స్ డ్రైవర్

వినాయక్‌నగర్, డిసెంబర్ 2: జిల్లా కేంద్రంలో మద్యం మత్తులో ఓ ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ హంగామా చేశాడు. అంబులెన్స్‌లో పేషెంట్ లేకుండానే సైరన్ మోగిస్తూ రోడ్డు పై ఇతర వాహనదారులను ఇబ్బందులకు గురిచేశాడు. సోమవారం సాయంత్రం ఓ అంబులెన్స్ సైరన్ మోగించుకుంటూ హైదరాబాద్ రోడ్డు గుండా వేగంగా వెళ్తుండడాన్ని ట్రాఫిక్ పోలీసులు గమనించారు. హైదరాబాద్ రోడ్డులో సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్సై సంజీవ్ అంబులెన్స్ రావడాన్ని గమనించి, ట్రాఫిక్ క్లియర్ చేయసాగారు. అప్పటికే వారి దగ్గరి వరకు వచ్చిన అంబెలెన్స్‌ను గమనించగా అందులో పేషెంట్ లేకపోయినా డ్రైవర్ మహ్మద్ ఇసాక్ సైరన్ మోగించుకుంటు వెళ్లడాన్నిగుర్తించిన ట్రాఫిక్ అధికారులు అంబులెన్స్‌ను అక్కడే నిలిపివేశారు. డ్రైవర్‌పై అనుమానం కలిగి బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేయగా అతడు మద్యం తాగి ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. కేసు నమోదు చేసి,అంబులెన్స్‌ను సీజ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీ ఎన్నిక

కామారెడ్డి, డిసెంబర్ 2 : పట్టణంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో నిర్వహించిన రాష్ట్ర విద్యా మహాసభలో సోమవారం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కామారెడ్డి జిల్లాకు చెందిన కొంగల వెంకటి, ప్రధాన కార్యదర్శిగా చవాన్ సుఖాన్ సింగ్, అసోసియేషన్ అధ్యక్షులుగా హన్మంత్, చంద్రశేఖర్, కన్నారాం, పరంధాములు, బసప్ప, చంద్రశేఖర్, యాదయ్య, లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా కాకయ్య, నిమ్మల కిష్టప్ప, మల్లేశం, నరేశ్, హీరాలాల్, కార్యదర్శులుగా నారాయణ, ముఖేశ్, అమృత, రాజన్న, గణేశ్, మహిళా కార్యదర్శులుగా ఉమారాణి, మీనా కుమారి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా సాయప్ప, గట్టయ్య, లింగన్న తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారి కాలపరిమితి 2026 వరకు ఉంటుందని తెలిపారు.

సైబర్ క్రైంపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

కామారెడ్డి రూరల్, డిసెంబర్ 2 : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం మానవ అక్రమ రవాణా, షీటీం, సైబర్ క్రైంపై కళా బృందం ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు షీటీం, సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలు, రోడ్డు భద్రత, బాల్యవివాహాల గురించి అవగాహన కల్పించారు. షీటీం నంబర్ 8712686094, సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో కామారెడ్డి పోలీసు స్టేషన్ ఎస్సై శ్రీరాం, యాంటీ ఉమెన్ ట్రాఫిక్ పోలీసు ఆఫీసర్ రాజేందర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్ (దోమకొండ), డిసెంబర్ 2 : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిందని, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

14న సీజ్ చేసిన వాహనాలకు వేలం

కామారెడ్డి, డిసెంబర్ 2 : పన్నులు చెల్లించకపోవడంతోపాటు ఇతర నేరాలకు పాల్పడి డిపార్ట్‌మెంట్ సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 14వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాలను క్లెయిమ్ చేయకుండా డీటీవో కార్యాలయం, ఆర్టీసీ డిపో, ఆర్డీఏ చెక్ పోస్టులో సీజ్ చేసిన వాహన యజమానులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారు తమ వాహనాలను రిలీజ్ చేసుకోలేదని తెలిపారు. ఆర్‌ఆర్ చట్టం కింద ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గుర్తించడానికి ఈ అన్‌క్లెయిమ్స్ వాహనాలకు వేలం వేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం రవాణా శాఖ వెబ్‌సైట్ http://www.transport.telangana.gov.in ను సందర్శించాలని తెలిపారు.

ఘనంగా శ్రీచక్ర అర్చన చండీ హోమం

బ్రాహ్మణ సంఘం సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

కామారెడ్డి, డిసెంబర్ 2 : జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్ ఉన్న త్రిశక్తి దేవాలయంలో శ్రీచక్ర అర్చన చండీ హోమంలో భాగంగా సోమవారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం చైర్మన్ నమిలకొండ కిరణ్ కుమార్, కామారెడ్డి జిల్లా బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసశర్మ, ప్రధాన కార్యదర్శి సతీశ్ కుమార్, కోశాధికారి నవీన్ కుమార్ శర్మ, బ్రాహ్మణ వికాస పరిషత్ పట్టణ అధ్యక్షుడు అర్జున్‌రావు, ప్రధాన కార్యదర్శి రామోహన్, కోశాధికారి నాగచందర్, ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్ రావు, వేద పురోహితుడు గంగవరపు ఆంజనేయ శర్మ, మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు సునీత, చక్రధర్ రావు, చైతన్య, మధుసూదన్ రావు, రామానుజారావు, పూర్ణచంద్రారావు, ఆలయ పూజారి శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల అందజేత

మాచారెడ్డి, డిసెంబర్ 2 : పాల్వంచకు చెందిన బక్కెల్లి భూపాల్‌గౌడ్, గంభీరావుపేట కు చెందిన అల్లే అశోక్ ఇటీవల ఫోన్లు పోగొట్టుకున్నారు. బాధితులు వెంటనే మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్లను బాధితులకు సోమవారం అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు ఆందోళన చెందకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలకు చివరి అవకాశం

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 2 : ఈ విద్య సంవత్సరం ఓపెన్ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 12 వరకు అపరాధ రుసుముతో పొడిగించినట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓపెన్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో- ఆర్డినేటర్ బి.కిశోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం సెల్ నంబర్ 9866343898, 9705771871 ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు గౌరారం విద్యార్థులు

గాంధారి, నవంబర్ 2: రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో సెపక్ తక్రా పోటీలకు మండలంలోని గౌరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ సత్యం సోమవారం తెలిపారు. మండలంలోని పొతంగల్ కలాన్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన రఘునాథ్, సరిత ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఎల్లారెడ్డి సర్కిల్‌కు 16మంది కానిస్టేబుల్స్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 2: ఎల్లారెడ్డి పోలీసు సర్కిల్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో16 మంది కానిస్టేబుళ్లు నూతనంగా విధుల్లో చేరారు. సోమవారం ఎల్లారెడ్డి సర్కల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ నాయక్ సమక్షంలో వీరు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించిన కానిస్టేబుళ్లకు పోలీసు ఉన్నతాధికారులు స్టేషన్లను కేటాయించారు.

భూముల వేలము ప్రకటన

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., ఉత్తునూర్, మం॥ గాంధారి, జి॥కామారెడ్డి
(యస్.సి.డి.ఆర్ / ఆఫీసర్ ఆన్‌స్పెషల్ డ్యూటీ ఎన్.డి.సి.సి. బ్యాంక్ లి., నిజామాబాద్ వారి ఉత్తర్వులననుసరించి)

ఇందుమూలముగా తెలియపరుచునది ఏమనగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., ఉత్తునూర్, మం॥ గాంధారి, జి॥ కామారెడ్డినకు బాకీ పడిన సొమ్ము మొత్తమును రాబట్టుటకు గాను ఈ దిగువ తెలిపిన తనఖా చేయబడిన భూములను తెలంగాణ సహకార సంఘాల చట్టంలోని రూలు 52 ప్రకారము బహిరంగ వేలము ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది. కావున సదరు వేలములో పాల్గొనుటకు ఆసక్తిగలవారు ఈ దిగువ తెలుపబడిన షరతులు మరియు నిబంధనలకు లోబడి పాల్గొనగలరు.

బాకీదారుని /తనఖాదారుని తండ్రి / భర్త పేరు	అమ్మబడు తనఖా వ్యవసాయ భూమి వివరాలు సర్వే నెం.	విస్తీర్ణం (ఎ. గుంట)	శివారు	వేలము తేది సమయం స్థలం	ఇ.పి.నెం.బాకీ బడిన సొమ్ము	వేలము నందు పాల్గొనుటకు ధరావత్తు సొమ్ము
శ్రీ కేతావత్ పరుశురాం (బాకీదారు) తండ్రి: కిషన్ నాయక్ గ్రా॥సోమారం, మం॥ గాంధారి జి॥ కామారెడ్డి	42/AA	1.2000	సోమారం	తేది: 04.12.2024 బుధవారం మ॥ 2 గం॥లకు సోమారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో	ఇ.పి.నెం. 116/LT/2020-21 రూ॥15,42,474/- అదనంగా (+) వడ్డీ (+) అపరాధపు వడ్డీ (+) తదుపరి కిస్తులు ఉన్నచో వడ్డీతో సహా (+) జప్తు ఖర్చులు (+) ఇతర ఖర్చులు	రూ॥10,000/-

షరతులు మరియు నిబంధనలు

1. పైన తెలుపబడిన తనఖా చేయబడిన భూముల వేలము వేయుటకు అమ్మకపు అధికారికి పూర్తి అధికారము గలదు.
2. వేలము బహిరంగముగా జరుపబడును.
3. ప్రకటనలో తెలిపిన బాకీదారుని ఆస్తి ఏకమొత్తములో వేలము వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము కలదు.
4.వేలము సమయమునకు ముందుగా బకాయిదారులు గాని అతని ప్రతినిధి గాని బాకీ పడిన సొమ్ము చెల్లించిన యెడల వేలము వాయిదా వేయబడును లేదా రద్దు చేయబడును.
5.వేలము నందు పాల్గొనుటకు ఆసక్తి గలవారు ధరావత్తు సొమ్మును ముందుగా అమ్మకపు అధికారికి గాని సంఘ కార్యదర్శికి గాని డిడి లేదా నగదు రూపేణా స్వయంగా లేదా ప్రతినిధి ద్వారా చెల్లించి రశీదు పొందగలరు. సదరు వేలము వాయిదా బడిన లేదా రద్దు అయినచో సదరు వ్యక్తి ఏ కారణముచేనైనా వేలములో పాల్గొనుటకు ఇష్టపడని యెడల ఇట్టి ధరావత్తు సొమ్ము వాపసు చేయబడును.
6.ధరావత్తు సొమ్ము చెల్లించిన వారు మాత్రమే వేలములో పాల్గొనుటకు అర్హులు.
7.సదరు వేలమునందు అధిక ధర పాట పాడిన వారికి వ్యవసాయ భూమిని (ఉన్నది ఉన్నట్లుగా) అప్పగించుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము గలదు. వేలము తేది నుండి (30 రోజుల) తరువాత సేల్ సర్టిఫికేట్ ఇవ్వబడును.
8. సదరు వేలములో అధికముగా వేలం పాడిన వ్యక్తి వేలం పాడిన కొనుగోలు సొమ్ము మొత్తములో 15శాతం సొమ్ము తక్షణమే డిపాజిట్ చేయవలెను. మిగతా సొమ్మును 15రోజుల గడువు లోపుగా చెల్లించవలెను. గడువులోగా పూర్తి సొమ్మును కొనుగోలుదారు చెల్లించని యెడల 15% డిపాజిట్ సొమ్మును వేలం పాటదారుడు కోల్పోగలడు. మరియు అట్టి ఆస్తి తిరిగి వేలం వేయబడును. కొనుగోలుదారుడు అట్టి ఆస్తిని గాని, అది అమ్మబడిన తరువాత ఏదేని భాగమునకు గాని అన్ని హక్కులను వదులుకొనవలెను. మొదటి కొనుగోలు దారుని రిస్క్ మీద సదరు ఆస్తిని తిరిగి వేలము వేయబడును. తిరిగి వేలము వేయుటకు ఆగు ఖర్చును మొదటి కొనుగోలుదారు భరించవలెను.
9. స్టాంపు డ్యూటీ రిజిస్ట్రేషన్ మరియు ఇతర చార్జీలు కొనుగోలుదారుడే భరించవలెను.
10. వేలం పాట పాడిన ధర అనుచితముగా లేదా తక్కువగా ఉన్న యెడలగాని లేదా ఇతర కారణముల వలన గాని హెచ్చువేలం పాటను అమ్మకపు అధికారి తిరస్కరించవచ్చును.
11. డిక్రీ హోల్డర్ అయిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి. ఉత్తునూర్ వేలములో పాల్గొనుటకు మరియు సెట్ ఆఫ్ చేసుకొనుటకు అర్హత కలదు.
12. వేలము నడపుటకు, ఖాయపరుచుటకు, వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు అమ్మకపు అధికారికి పూర్తి స్వేచ్ఛ కలదు.
13. భూమి సర్వే నెంబర్ మరియు విస్తీర్ణము మొ॥ వివరముల యందు ఒకవేళ తప్పులు ఉన్నచో దానికి ప్రభుత్వము బాధ్యత వహించదని గమనించగలరు.

తేది: 01-11-2024 నిజామాబాద్.

సం/- మేనేజర్ / అమ్మకపు అధికారి
ది.నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., నిజామాబాద్

పిచ్చి మొక్కలు, చెత్త తొలగింపు

ట్రాక్టర్ బ్లేడుతో చేపడుతున్న తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకర్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 2: నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట, చుట్టుపక్కల పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తను సోమవారం మండల పరిషత్ అధికారులు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి తొలగించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో సోమవారం అపరిశుభ్రతకు కేరాఫ్ ఎంపీడీవో కార్యాలయం శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు కార్యాలయం ఎదుట ఉన్న పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తను తొలగించినట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. సెప్టిక్ ట్యాంకు గుంతలను రెండు రోజుల్లో పూడ్చి వేస్తామన్నారు.

మత్తుపదార్థాలు వాడితే జీవితం సర్వనాశనం : డీఎస్పీ

ఎల్లారెడ్డిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 2: విద్యార్థులు తాత్కాలిక ఆకర్షణలకు లోనై మత్తుపదార్థాలకు అలవాటుపడితే భవిష్యత్తు, జీవితం సర్వనాశనమవుతుందని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం ఎల్లారెడ్డి అంబేద్కర్ చౌరస్తాలో బజ్‌రంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నశాముక్త్ భారత్' 2కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. గాంధీచౌక్‌లో మానవహారం నిర్మించిన విద్యార్థులు మత్తుపదార్థాలను వాడవద్దని నినాదాలు చేశారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. మత్తుపదార్థాల వినియోగం అనేది నేడు ప్రపంచ సమస్యగా మారిందన్నారు. తమ వంతు సామాజిక బాధ్యతగా భావించి బజ్‌రంగ్‌దళ్ సభ్యులు ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై బొజ్జ మహేశ్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాల్‌కిషన్ గుప్తా, బజ్‌రంగ్‌దళ్ నాయకులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరాలయ పరిరక్షణకు చర్యలు

త్రిలింగేశ్వరాలయం చుట్టూ కొలతలు వేస్తున్న పురావస్తు శాఖ అధికారులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 2: నాగిరెడ్డిపేట మండల పురాతన శైవక్షేత్రం త్రిలింగేశ్వరాలయాన్ని సోమవారం పురావస్తు శాఖ అధికారులు స్తపతి, లక్ష్మీనారాయణ, శంకర్ సందర్శించారు. ఆలయ గర్భగుడిలో కలియ దిరిగారు. గర్భగుడిలో వేర్వేరుగా ఉన్న రామేశ్వరుడు, సోమేశ్వరుడు, భీమేశ్వరుడు లింగాలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ పరిసరాలను నిశితంగా గమనించారు. కొలతలు వేశారు. ఆలయ చరిత్ర, పలు అంశాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తు, కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. వెయ్యిఏండ్ల కట్టడమైనా ఆలయ కళానైపుణ్యం అద్భుతంగా ఉందని, శివలింగంపై సూర్య కిరణాలు పడడం అత్యద్భుతంగా ఉందన్నారు. చారిత్రక కట్టడమైన ఈ దేవాలయాన్ని రక్షించుకోవడానికి కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి వచ్చామని, త్వరలోనే ఆలయ పరిరక్షణకు రాతి పగులు సరి చేయడం, కెమికల్ వాష్ తదితర అంశాలపై పూర్తి స్థాయి నివేదిక అందిస్తామన్నారు. వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు దివిటి కిష్టయ్య, రాజశేఖర్, రాచర్ల రమేశ్, తలకొక్కుల రమేశ్, బెస్త కిషన్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

మద్నూర్, డిసెంబర్ 2: మండలకేంద్రంలోని జాతీయరహదారిపై సోమవారం ప్రమాదవశాత్తు కారు దగ్ధమైంది. మద్నూర్ నుంచి దెగ్లూర్ వైపు వెళ్తుండగా కారులో నుంచి పొగ రావడంతో అందులో ఉన్నవారు దిగిపోయారు. కారులో మంటలు ఒకేసారి చెలరేగి పూర్తిగా వ్యాపించాయి. ఘటనా స్థలానికి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అర్పేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

లింగంపేట్, డిసెంబర్ 2: మండలంలోని బోనాల గ్రామానికి చెందిన బెస్త రాములు అంత్యక్రియలకు తాపీ మేస్త్రీల సంఘ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాములు సోమవారం మృతి చెందడంతో వారి కుటుంబీకులను కలిసి పరామర్శించి, రూ.8వేల ఆర్థిక సహాయం అందించారు. తాపీమేస్త్రీల సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షులు చిరంజీవి, సాయిబాబు, మౌలాలి, సంజీవ్, రమేశ్, రవి, రామారావు, పురుషోత్తం, బాషా తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రామారెడ్డి, డిసెంబర్ 2: మండలంలోని మోషంపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో ఆనంద్‌రావు సందర్శించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట గదిని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఆవాస ప్రాంతం సందర్శించిన ఎంఈవో..

రామారెడ్డి : మండలంలోని ఉప్పల్‌వాయి శివారులో ఇటుక బట్టీల వద్ద ఆవాస ప్రాంత విద్యార్థుల కోసం పాఠశాల ఏర్పాటు చేయాలని సోమవారం ఎంఈవో ఆనంద్‌రావు పరిశీలించారు. ఇటుక బట్టీ యజమానితో పాఠశాల ఏర్పాటు గురించి మాట్లాడారు. అధికారుల నుంచి అనుమతి రాగానే పాఠశాల ఏర్పాటు చేస్తామని ఎంఈవో తెలిపారు.

విద్యార్థులకు ఆట వస్తువుల వితరణ

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 2 : పిట్లం మండలం గౌరారం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎల్లయ్య తన సొంత డబ్బులు రూ.నాలుగు వేలతో విద్యార్థులకు ఆట పరికరాలను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సోషల్ డే..

పెద్ద కొడప్‌గల్ : పిట్లం మండలంలోని పెద్ద రాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సోషల్ డే నిర్వహించారు. సోషల్ డేపై హెచ్ఎం శ్రీలత విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విఠల్, రాజు, స్వరూప, నీలిమ, పుష్పలత, పోతన్న, పీఈటీ మల్లేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు..

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 2 : మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీని సోమవారం పంచాయతీరాజ్ డీఈ మధుబాబు, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ కాలనీకి మౌలిక వసతులు కోసం రూ.57లక్షల70వేలు మంజూరైనట్లు తెలిపారు. తాగునీటి వసతి, విద్యుత్, డ్రైనేజీ పనులు చేపడతామని పేర్కొన్నారు.

పోలిపాడ్యమి ప్రత్యేకపూజలు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 2: పట్టణంలోని పెద్దచెరువు వద్ద సోమవారం పోలిపాడ్యమి సందర్భంగా మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించి, నదిలో దీపాలు వదిలారు. కార్తీక మాసంలో ఏ రోజూ దీపాన్ని వెలిగించకపోయినా, పోలిపాడ్యమి రోజున 30 వత్తులతో దీపం వెలిగించి నీటిలో వదిలితే ఆ మాసమంతా దీపారాధన చేసిన పుణ్యం వ